# 6వ పుష్పము

6. ఓం శ్రీ సత్యగుణాత్మనే నమః

1) నామ పారాయణ ప్రియుడు :

"అప్రియం కానిది, అనృతం కానిది సత్యం" (శ్రీశంకరులు) "యథా ఆభూత్ అర్థవచనమ్" జరిగినది జరిగినట్లు, ఉన్నది ఉన్నట్లు, చూచినది చూచినట్లు చెప్పుట సత్యగుణాత్ముని లక్ష్యం. అట్టివారే స్వామి."సత్యమేవ జయతి నానృతం" (ముం॰ఉ) = సత్యమే ఎప్పటికైనా జయిస్తుంది. అనృతము (అబద్ధము) ఎన్నటికిని జయించదు. సత్యమనగా దేశ, కాల, పాత్రలకు అతీతమైనది. సత్యమునే "ఋతము" అన్నది వేదాంతము. అట్టి సత్యమైన గుణములు కలవానికి. సత్యమే వ్రతముగా గల వానికి నమస్కారము చేయుచున్నాను.

2) కవీశ్వరుడు

పరమాత్ముని గురించి స్వామివాణి యిట్లా అంటుంది.

ప॥ అల్లాయంచు మహమ్మదీయులు, యహోవాయంచు సత్ క్రైస్తవుల్<br>
పుల్లాబ్జాక్షుడటంచు వైష్ణవుల్, శంభుడంచు శైవుల్,<br>
ఉల్లాసంబున గొల్వ నెల్లరును ఆయుర్భాగ్య భోగ్యాది సం<br>
ప ల్లాభంబు లొసంగి, బ్రోచు పరమాత్మ ఒక్కడంచు ఎంచుడీ ॥

తా॥ ఏ మతంవారికైనా, దేవుడు ఒక్కడే. నామ రూప భేదమే తప్ప వస్తు భేదము లేదు. ఆ పరమాత్ముడే అందరిని రక్షించుచున్నాడు.

3) సకలతత్త్వ బోధకుడు

"నిజజ్ఞానము - అద్వైత దర్శనము గురించి" స్వామి అన్నారు.

యింద్రియముల కంటె, యింద్రియార్థములు బలమైనవి. కన్నులు చూస్తున్నవి. చూడటం తప్పుకాదు. కాని చూచిన వస్తువుపై వాంఛ పుడుతుంది. ఆ వాంఛలు కలగడం తప్పు. నాలుక వున్నది. నాలుకలో దోషములేదు. కాని కఠినమైన పలుకులు పలికితే తప్పు. ఇంద్రియములను అరికట్టినంత మాత్రమున లాభము లేదు. ఇంద్రియార్థములను అరికట్టాలి. కనుక మంచి దృష్టి, మంచిమాట, మంచి శ్రవణము, మంచి వాసన, మంచి స్పర్శను గురించి అందరికీ తెలియజేయాలి. ఎవరినంటే వారిని తాకకూడదు. శారీరకంగా రోగము రావడమే కాక, ఆధ్యాత్మికంగా కొన్ని రోగాలు ఏర్పడుతాయి. శాస్త్ర గ్రంథాలు వున్నాయి. సాంఖ్య, న్యాయ, వైశేషిక, యోగ, పూర్వ మీమాంస, ఉత్తర మీమాంస శాస్త్రములు వున్నాయి. వీటిని దర్శనములు అని కూడా అంటారు. ఉత్తర మీమాంస (వేదాంతం) తప్ప తక్కినవన్నీ ద్వైతాన్ని బోధిస్తాయి. ఇవి(శాస్త్రాలు) అన్ని పురాణములను ఆధారము చేసుకొని వచ్చాయి. వేదాంతము వేదమును ఆధారము చేసుకొని వచ్చింది. మిగిలిన దర్శనములకును, వేదాంతమునకు గల వ్యత్యాసము యిదే. వేదాధారమైన వేదాంతము కట్టకడపటిది "న కర్మణా, న ప్రజయా, ధనేన, త్యాగేనైకే అమృతత్త్వ మానశుః" (కై.ఉ.) అని చెప్పింది వేదాంతము అమృతతత్త్వమైన, ఆత్మతత్త్వము అనుభవించాలంటే త్యాగము చెయ్యాలని బోధించింది. (అన్నీ ఉన్నంతవరకు బంధమే). అప్పుడే ఏకత్వం ఏర్పడుతుంది. అదే "అద్వైత దర్శనం". అద్వైత దర్శనమే జ్ఞానమన్నారు. దానినే "ఏక మే వాద్వితీయం" అని వేదం శాసించింది. ఏతావాతా అన్ని దర్శనాలు కూడా ఒక గమ్యమునే నిరూపిస్తూ వచ్చాయి.

అన్నిటిలోను 'నేను' అనే తత్త్వాన్ని అర్థం చేసుకోడమే విశిష్ఠత. "నేను" అనేది కేవలము మూలాధారమైనది. నేను దేహమును కాను. నేను అనగా "అహం" ఆత్మతత్త్వము నుండి ఆవిర్భవించింది. కర్తవ్య కర్మలను ఆచరిస్తూ ఆచరింప చేసే నాయకుడు నాయందున్నాడన్న సత్యాన్ని విశ్వశించాలి. అప్పుడే నిజమైన ఆనందము కలుగుతుంది. అది నిత్యసత్యమైనది. ఆత్మదర్శన మనగా తన్ను తాను తెలిసికోడానికి ప్రయత్నించడం. అదే దుఃఖ నివృత్తి, అదే ఆనంద ప్రాప్తికి మూలము.

4) సర్వజ్ఞుడు

మాండూక్యోపనిషత్తు కారికలు - (గౌడ పాదాచార్యులు)

ఆత్మదర్శనము కోసమే నాలుగు వేదాలు, వేదాంగాలు, పురాణములు, ఇతిహాసములు, సర్వవిద్యలు, సర్వకళలు ఉన్నాయి. అట్లే బ్రహ్మసూత్రాలు, వాటి భాష్యాలును, అన్నిటికి గమ్యస్థానము ఒక్కటే. "ఏకం సత్, విప్రా బహుధా వదంతి" సత్యము ఒక్కటే, పండితులు అనేక విధములుగా చెప్పుతారు. All Roads lead to Rome only. వీటి నన్నిటినీమధిస్తే వచ్చేది "అహం బ్రహ్మాస్మి" ఈ జగత్తు అనేక విధములుగా కనబడుతోంది. అంతా పరమేశ్వరుడేయని తోస్తుంది. ఇంకా తరచి ఆలోచిస్తే "నేనే పరమేశ్వరుడ"ని తేలుతుంది. అంతా బ్రహ్మమయమే. "నే హనా నాస్తి కించన" ఇచ్చట వేరుగ ఏ కొంచెమైనను లేదు. అద్వైత దర్శనమే మోక్షము. బ్రహ్మము ఆత్మైకత్వ పరిజ్ఞానము. అది శాస్త్రము కాజాలదు. శాస్త్రము దానికి ఒక సాధనము. ప్రయోజనాన్ని యిస్తుంది. ఆత్మతత్త్వమును తెలిసికొనిన యెడల అవిద్యాతృష్ణాది దోషములకు అవకాశమే లేదు.

మం॥అమాత్ర శ్చతుర్థో వ్యవహార్యః ప్రపంచోపశమం, శివో ద్వైత
ఏవమోంకార ఆత్మైవసంవిశత్యాత్మనా త్మానం య ఏవం వేద. (మాం.ఉ.12)

తా॥ అమాత్ర యనగా తురీయమగు ఆత్మయే. అది అవ్యయం, ప్రపంచోపశమనం. మంగళ స్వరూపం. అద్వైతం అగు ఓంకారమే యగుచున్నది.

మం॥ తత్ర కో మోహః కశ్శోక ఏకత్వ మనుపశ్యతి (ఈ.ఉ.)
అంతా ఒకటిగా నున్నప్పుడు మోహమేది? శోకమేది?

మం॥ భిద్యతే హృదయగ్రంధి శ్ఛిద్యంతే సర్వసంశయా ।
క్షీయంతే చా శ కర్మాణి తస్మిన్ దృష్టే పరవరే ॥ (ముం.ఉ. 2-2-3)

తా॥ అట్టి ఆత్మదర్శనం "ఏక మే నా ద్వితీయం" (చా.ఉ.) ఆత్మ ఒక్కటే. రెండవది లేదు అను విషయాన్ని తెలియజేస్తుంది.

5) ప్రేమ స్వరూపుడు

మన అందరి గమ్యస్థానము దైవత్త్వము. అది ఎట్లా చేరేది? స్వామి అంటారు. "తేలిక మార్గము చూచుకోవాలి. గమ్యస్థానం చేరటానికి షడ్దర్శనాలు అనే 6 శాస్త్రాలు వున్నాయి. అవి ముళ్లబాట వంటివి. కఠినమైన రాళ్ళలో పడి కష్టములకు గురికావద్దు. ఇది కత్తిపై పాము వంటిది. నిప్పుతో చెలగాటము వంటిది. ఏ పవిత్రులైన మహర్షులో& వీటిని సాధించగలరు గాని, సామాన్య మానవులు దీనిని సాధించలేదు. రాచబాట - దగ్గరత్రోవ "ప్రేమతత్త్వము" ఆ ప్రేమ తత్త్వానే అర్థము చేసుకొని ఆచరణలో పెట్టడానికి ప్రయత్నించండి. ప్రేమచేత ఎంతైనా సాధించవచ్చు. షడ్దర్శనముల ప్రభావము గొప్పదే. అనుభవించినప్పుడే ఆనందం. అన్నిటికి ఆధారమైన ఆత్మ "నేను" అనే లక్ష్యమునందే సర్వరూపములు ఇమిడియున్నవి. ఒకటి ఒక అంకె. దాని ప్రక్కను సున్నాలు పెట్టితే, కొద్ది విలువలు కోటాను కోట్లకు పెరిగిపోతుంది. ఆ ఒక్కటీ తీసివేస్తే అంతా సున్నా అవుతుంది."

దివ్యలీల : ఆ ప్రేమ స్వరూపుడు సుప్రసిద్ధ నేత్రవైద్యుడు మోడీకి వజ్రపు టుంగరమును సృష్టించి బహూకరించారు.

దివ్య చికిత్స : ఆ ప్రేమ స్వరూపుడే 1963 జూన్ 23న ఒక భక్తుని పక్షవాతము తాను స్వీకరించి ఒక వారము తాను అనుభవించి ఆ భక్తుని కాపాడాడు.

6) సకల జనప్రియుడు : (శ్రీ జంధ్యాల వెంకటేశ్వర శాస్త్రి)
స్వామి ఎన్ని పెనుగొండలో ధరించినాడు.

ప॥ స్వామి శిరస్సుపై గల అజస్ర సహజ శిరోజ పంక్తి ఈ
భూమి సహస్ర భక్తజన పుంజములన్ పరిరక్షచేసి, సం
క్షేమము గూర్పదాల్చిన విశిష్ఠ సురార్చిత దివ్య పర్వత
స్తోమమటంను నెంచి మది స్తోత్రము చేసెద సాయికృష్ణునిన్ ॥

ప॥ నాడు కృష్ణుడు గోవర్ధనమ్ము నెత్తి వజ్రికురిపించు పెను జడివాన నుండి
పాడిపశువులతో గొల్లపల్లెనొకటి ఏడు దినములుగా రక్షించినాడు ॥

ప॥ సాయికృష్ణ ఈ ప్రపంచంబునిండ వ్యాప్తమైనట్టి భక్తుల వెతలు మాన్ప
జన్మ నుండియు మృదుల కేశముల కొనలు ఎన్ని పెనుగొండలో ధరియించినాడు

అని "ఎన్ని పెనుగొండలో ధరించినవాడు" వ్రాసారు.

గోపాలకృష్ణుడు గోవర్ధన పర్వతము నెత్తి అందరిని గాచి, గోవర్ధన గిరిధారి అయినారు. ఇప్పుడు యిక్కడ సాయి కృష్ణుడు ఎన్నో పెద్ద కొండలు ఎత్తి భక్తుల బాధలను పోగొట్టుతున్నారు.

7) స్తుతి ప్రియుడు

స్వామి సాయి ముకుందుడని భజనలో వర్ణింపబడ్డారు. స్వామి భజన గూర్చి యింకా ఏమి చెప్పారో చూస్తాము "ఆధ్యాత్మిక బోధకు నామస్మరణమే, భజనయే పునాది". "హరేర్నామ, హరేర్నామ, హరేర్నామైవ కేవలం. కలౌనాస్త్యేవ గతి రన్యథా". కాబట్టి కలియుగంలో నామానికి మించినది లేదు. కలియుగమున నామ సంకీర్తనమే తరుణోపాయము. అన్ని నామములు ఒక్క పరమాత్మునివే. హరి హర ఈ రెండు నామముల అర్థము ఒక్కటే.

శ్లో॥ శివాయ విష్ణు రూపాయ శివరూపాయ విష్ణవే ।
శివస్య హృదయం విష్ణు విష్ణోశ్చ హృదయం శివః ॥

శ్లో॥ యధా శివమయే విష్ణురేవం విష్ణుమయ శ్శివః
యధాంతర న పశ్యామి తథామే స్వస్తిరాయుషి ॥ అని వేదాంతం

హరి హరులు ఒక్కరే అని తెలుసుకొన్న వారికి యోగక్షేమములు ఆయురారోగ్యములు పెరుగుతాయి. మనస్సనే మదపుటేనుగును నామస్మరణ అనే పగ్గముతో కట్టివేయవచ్చును.

భజన : రాధే గోవింద హరే మురారే!
శ్యామ ముకుంద హరే మురారే ॥రా॥
కృష్ణ గోవిందా హరే మురారే!
సాయి ముకుందా హరే మురారే ॥రా॥

8) వేదాంతవేద్యుడు
సాయి పరమేశ్వరుని వేదం ఎట్లా వర్ణించింది?

మం॥ అణోరణీయా న్మహతో మహీయా
నాత్మ స్య జంతుర్నిహితో గుహాయాం ।
తమక్రతుః పశ్యతి వీతశోకో
రాతుప్రసాదా న్మహిమాన మాత్మన ॥ (క.ఉ.1-2-20)

తా॥ ఆత్మతత్త్వము మిక్కిలి అల్పపరిమాణము గల శ్యామాదికము కంటె మిక్కిలి సూక్ష్మమైనది. మిక్కిలి గొప్ప పరిమాణము గల పృధి వ్యాదికముల కంటె మిక్కిలి మహత్తరమైనది. అణుపరిమాణమో లేక మహత్పరిమాణమో గల వస్తువు గనబడుచున్నదో అది నిత్యమగు ఆత్మ చేతనే స్థితి గలది యగుచున్నది. ఆత్మ విరహితమగు వస్తువు అసత్తగుచున్నది. ఈ ఆత్మ సర్వనామ రూప వస్తూసాధిక మగుట చేత అణుపరిమాణ, అయినదాని కంటె అణుతరమును, మహాపరిమాణమైన కంటె, మహత్తరమను అగుచున్నది. అట్టి ఆత్మ బ్రహ్మాది స్తంబ పర్యంతమగు ప్రాణిజాతము యొక్క బుద్ధిగుహ

యందు ఆత్మభూతమైయున్నది. దర్శన, శ్రవణ, మనన విజ్ఞానమునే లింగముగా గల అట్టి ఆత్మను అక్రతువు అనగా నిష్కాముడు. దృష్టాదృష్ట బాహ్య విషయోపరత బుద్ధిగలవాడు మాత్రమే గాంచుచున్నాడు. ఎప్పుడిట్టి జ్ఞానము లభించునో అప్పుడు ధాతువులు అనగా మనస్సు మొదలగు యింద్రియములు ప్రసన్నములై యుండుట చేత ఆత్మ యొక్క మహిమను కర్తనిమిత్తమైన వృద్ధి క్షయ రహితమైన దానిని ''ఆయ అహ మస్మి'' అని సాక్షాత్తుగా నెరుంగును. అట్లు నెరుంగుట వలన గతించిన శోకము గలవాడగుచున్నాడు.

**ఓం తత్సత్**